క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక


కె.రమణ, అధ్యక్షుడు


శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని మంగళవారం నల్లగొండ జిల్లా కార్యాలయంలో ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఏడ్ల సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా కె.రమణ, ప్రధాన కార్యదర్శిగా ఆదిమళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎం.శేఖర్‌రెడ్డి, పి.పుణ్యవతి, కోశాధికారిగా బి.శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ఆడిట్ కన్వీనర్‌గా కె.అంజనేయులు, కార్యదర్శులుగా బి.వెంకన్న, పి.శివ, వజీహా తబస్సుమ్, గౌరవ సలహాదారులుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీహెచ్.యోగేంద్రనాథ్, జి.పద్మావతి, టి.కరుణాదేవిలను ఎన్నుకున్నారని తెలిపారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ నల్ల యాదయ్య తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ వచ్చేవారు తమ సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫొటో రూ.50 తీసుకుని మేళాకు హాజరుకావాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి కంచర్ల సంతాపం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం సర్వారం గ్రామ మాజీ సర్పంచ్ తగుల సైదమ్మ బుధవారం మృతి చెందారు. సైదమ్మ మృతికి నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సైదమ్మ వార్డు మెంబర్‌గా, సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

సీపీఎం నాయకుడు మృతి

చండూరు : గట్టుప్పల మండల పరిధిలోని తేరటుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు వల్లూరి బీరప్ప(70) బుధవారం అనారోగ్యంతో మరణించారు. బీరప్ప మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సలీం, బొల్లురి నరసింహ, పగిళ్ల శ్రీనివాస్, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి నరసింహ, వల్లూరి శ్రీశైలం, బొట్టు శివకుమార్, బండారి కృష్ణయ్య పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం ఉపాధ్యాయులకు సన్మానం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్

చిట్యాల: పట్టణంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బోయ శ్రీనివాస్‌కు పుడమి సాహితి వేదిక విద్యారత్న పురస్కారాన్ని అందజేసింది. భవిత కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పురస్కార గ్రహీత శ్రీనివాస్‌తోపాటు మరో ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఆవుల గీతను ఎస్‌ఎంసీ సభ్యులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోలి స్లీవమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ గోలి భాస్కర్, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మీ, వనజ, ఎంఆర్‌సీ సిబ్బంది వరలక్ష్మీ, సరిత, ప్రవళిక పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శెట్టిపల్లి రాంరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆ గ్రామంలో జరిగిన రాంరెడ్డి దశదిన కర్మలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ అందించిన రూ.50వేల నగదును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, ఎంపీటీసీ మాదగోని కవిత రామలింగయ్య, నోముల జనార్దన్, బండపల్లి కొమరయ్య, పాదూరి శంకర్‌రెడ్డి, గూని వెంకటయ్య, వడ్లకొండ పరమేశ్, పెరుమాండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావో

మర్రిగూడ: మండలంలోని కొండూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు గల ఆహారాన్ని ప్రతిరోజు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్.శోభారాణి, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి తిప్పలు తప్పేనా !


ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు


బోరింగ్ వద్ద నీటిని పడుతున్న వృద్ధురాలు


బోరింగ్‌ను రిపేర్ చేస్తున్న సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్న పగిడిమర్రి గ్రామ ప్రజలు
- ట్యాంకర్లతో తాగు నీటి సరఫరా
- చేతిపంపులకు మరమ్మతులు

కనగల్: వేసవి కాలం రాకముందే కనగల్ మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో తాగు నీటి గోస మొదలైంది. పగిడిమర్రి గ్రామంలో 8 గ్రామపంచాయతీ బోర్లు ఉండగా ఇప్పటికే 8 బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. గత 10 రోజుల్లో గ్రామంలో 6 బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదు. దీంతో గ్రామస్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. జనవరి నెలలోనే పరిస్థితి ఈ విధంగా ఉందంటే వేసవిలో తమ పరిస్థితి ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

బోరింగ్‌లకు మరమ్మతులు..

పగిడిమర్రి గ్రామంలో పాత బోర్లు ఎండిపోయాక, ఇటీవల వేసిన బోర్లు పడక గతంలో ఉన్న చేతిపంపులపై గ్రామస్తులు ఆధారపడాల్సి వచ్చింది. దీంతో గ్రామంలో ఉన్న పాతకాలం నాటి బోరింగ్ పంపులను స్థానిక సర్పంచ్ గోలి నర్సిరెడ్డి మరమ్మతులు చేయిస్తున్నారు. చేతిపంపుల్లో కూడా నీరు అడుగంటి పోయింది. 4 బిందెల నీరు వచ్చిన తర్వాత మరో 15నిమిషాల ఆగి బోరింగ్ కొడితేనే నీళ్లు వస్తుండడంతో ప్రజలు నీటికోసం నరకం చూస్తున్నారు. దీంతో సర్పంచ్ తన మూడు ఎకరాల వ్యవసాయ పొలాన్ని వదిలి పెట్టి సొంత బోర్ నీటితో రెండు వాటర్ ట్యాంకర్లతో గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. అయినా నీరు సరిపోక చుట్టు పక్కల గ్రామాల నుంచి ట్యాకర్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. గ్రామంలో తాగు నీటి కష్టాలు తీర్చేందుకు గడిచిన 20 రోజుల్లో రూ.4లక్షలు ఖర్చు చేసినట్లు స్థానిక సర్పంచ్ తెలిపారు. అయినా గ్రామంలో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదంటున్నారు. పగిడిమర్రి గ్రామంలో ఉన్న వాగులోంచి పదేళ్లుగా ఇసుక తవ్వడం వల్ల వాగులో ఉన్న బోర్లు పూర్తిగా ఎండిపోయాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

మరికొన్ని గ్రామాల్లో..

భూగర్భ జలాలు ఎండిపోవడంతో పగిడిమర్రితోపాటు లింగాలగూడెం గ్రామంలో ఉన్న రెండు బోర్లు నీరు పోయడం లేదు. గ్రామంలో చేతిపంపులు కూడా లేకపోవడంతో గ్రామస్తులు తాగు నీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. దీంతోపాటు కనగల్ మండలంలోని తిమ్మన్నగూడెం, తేలకంటిగూడెం గ్రామాల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది.

ఏఎమ్మార్పీ నీటిని వదలాలి



గ్రామంలో 20 రోజుల నుంచి తాగు నీటి కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం పట్టించుకుని మా గ్రామానికి నీరు వచ్చే విధంగా చూడాలి. ఇప్పటికే తాగు నీటి కోసం సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు చేశాం. ఏఎమ్మార్పీ నీటిని వారం పది రోజుల పాటు విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లోకి నీరు వచ్చి చేరుతుంది.

–గోలి నర్సిరెడ్డి, సర్పంచ్ పగిడిమర్రి

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామంలో తాగునీటికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉన్న బోర్లు పోయక పోవడంతో చేతిపంపులు, గ్రామానికి ట్యాంకర్ల ద్వారా తీసుకువచ్చే నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. వ్యవసాయ పనులు విడిచిపెట్టి నీటి కోసం వేచి చూస్తున్నార్లు. అధికారులు పట్టించుకుని మా గ్రామానికి సక్రమంగా నీరు వచ్చే విధంగా చూడాలి.

–కందుల విజయలక్ష్మీ, పగిడిమర్రి

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్


మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య

కట్టంగూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లోపు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలన్నారు. పార్టీకి పునర్వైభవం తీసుకొచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్, పామనగుండ్ల సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే జానీపాషa, వార్డు సభ్యుడు రెడ్డిపల్లి మనోహర్ ఉన్నారు.

భారతరత్న కర్పూరి ఠాకూర్‌కు నాయీ బ్రాహ్మణుల నివాళి


నివాళులర్పిస్తున్న నాయీ బ్రాహ్మణులు

నల్లగొండ : భారత రత్న పురస్కార గ్రహీత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ 100 జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారత రత్న ప్రకటించింది. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా నాయీ బ్రాహణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘం భవన్‌లో కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్, కంది సూర్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, చింతకుంట్ల చంద్రం, దుగ్యాల లక్ష్మీనారాయణ, మామిడాల లింగయ్య, వల్లోజు సతీష్ పాల్గొన్నారు.

26న రథయాత్ర

నల్లగొండ టౌన్: ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ ప్రచార రథయాత్ర నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ భవనం నుంచి 12 గంటలకు యాత్ర ప్రారంభమై గడియారం సెంటర్ మీదుగా ప్రకాశంబజార్, ఎన్జీ కళాశాల, రామగిరి నుంచి బస్టాండ్ వరకు సాగుతుందన్నారు. ధర్మసమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రశంసా పత్రం అందజేత

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను నల్లగొండలో ఇంటింటా ప్రచారం చేసినందుకు యువజన కాంగ్రెస్ నాయకుడు జహంగీర్ బాబాకు బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్సి ప్రశంసా పత్రం అందించారు. కాంగ్రెస్ అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యత


నకిరేకల్: కేక్ కట్ చేస్తున్న ఎంఈఓ నాగయ్య, కౌన్సిలర్ గాజుల సుకన్య


చిట్యాల: ఏపూరులో ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు


శాలిగౌరారం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని

రామగిరి(నల్లగొండ): ఆడ పిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని తిప్పర్తి మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సునిత అన్నారు. తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.లక్ష్మి, డి.భారతమ్మ, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నకిరేకల్ : జాతీయ బాలికా దినోత్సవాన్ని నకిరేకల్‌లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మేకల నాగయ్య, 4వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గాజుల సుకన్య పాల్గొని కేక్ కట్ చేశారు. పాఠశాల హెచ్‌ఎం అరుణారాణి, కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రతినిధులు బండగొర్ల సుజాత, ధనమ్మ, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని నోముల జెడ్పీ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, హెచ్‌ఎం సుందరి, ఉపాధ్యాయులు కవిత, జ్యోతి, లక్ష్మీ, పద్మ, వెంకటయ్య, కృష్ణ, యాదగిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

శాలిగౌరారం: బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భవాని, జ్యోతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జేఎంజే ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో –బేటీ పడావో కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎం జానయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, బాలికలు ఉన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ..

చిట్యాల: బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏపూరు, వనిపాకల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం లింగ వివక్ష, బాల్య వివాహాలు, పోషకాహారం, బాలికల అక్రమ రవాణ వంటి అంశాలపై విద్యార్థినులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పారిజాత, రోజా అవగాహన కల్పించారు. ఏపూరులో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సైదులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మీ, వనిపాకల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ మేడి జానమ్మ, మేడి నర్సింహ, కట్టంగూరి మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద ఉచిత వైద్యశిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారి సాయికుమార్

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ శివారులో 65 నంబరు జాతీయ రహదారిపై గల జీఎమ్మార్ టోల్ ప్లాజా వద్ద బుధవారం జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపోలో టైర్స్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో హైవేపై వెళ్తున్న 75 మంది వాహనాల డ్రైవర్లకు ఉచితంగా బీపీ, షుగర్, టీబీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 45 మంది డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఎల్ ఎస్.సాయికుమార్, ఆర్ఈ మల్యాద్రి, అపోలో టైర్స్ ఫౌండేషన్ మేనేజర్ స్వప్న, డాక్టర్ రమ, ఎన్‌హెచ్‌ఏఐ ప్రతినిధులు సతీష్, రాఘవ, టోల్ మేనేజర్ ఎ.శివకుమార్, సీఆర్ నాగకృష్ణ, వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు నరేష్, సందీప్, ఎ.శ్రీనివాస్, జ్ఞానేందర్, చంద్రశేఖర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. నలుగురికి గాయాలు

మర్రిగూడ : రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి, రాజాపేట తండా గ్రామాల మధ్య బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై మర్రిగూడకు వెళ్తున్నాడు. అదే సమయంలో కొట్టాల గ్రామానికి చెందిన బుర్ర రాజు, ఇందుర్తికి చెందిన పదం సత్తయ్య, సరంపేటకు చెందిన జెల్లాకుల యాదయ్యతో కలిసి మర్రిగూడ నుంచి వారి గ్రామాలకు ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న వెంకటేష్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పగిళ్ల వెంకటేష్, బుర్ర రాజుల తలలకు, పలు చోట్ల తీవ్ర గాయాలు కావడంతో వారిని మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పదం సత్తయ్య, జెల్లాకుల యాదయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆస్పత్రిలో కేవలం ఒక్కరే వైద్యుడు అందుబాటులో ఉంటుండడంతో అత్యవసర సమయంలో వైద్యం అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన నిర్వహించారు.

అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తా

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


మర్రిగూడ : ఇందుర్తిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి శంకుస్థాపన చేశారు. మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభం, అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొట్టాలలో సహస్ర వేదిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు డిండి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేలా, నిర్వాసితులకు న్యాయం జరిగేలా చొరవ చూపుతానన్నారు. అనంతరం గ్రామపంచాయతీ నిర్మాణానికి సహకరించిన స్థల దాత ఉపేందర్‌రెడ్డిని సన్మానించారు. ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, వెన్నమనేని రవీందర్‌రావు, ముద్దం నర్సింహగౌడ్, రాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, మెండు దీపికరెడ్డి, సర్పంచ్‌లు పాక నగేష్‌యాదవ్, గంట కవితయాదయ్య, జంగిలి లక్ష్మీప్రసన్నరవి, ఎంపీటీసీలు ఏర్పుల శ్రీశైలం, ఉరిపక్క సరితనగేష్, నాయకులు బేత వెంకటేష్‌యాదవ్, కల్లెం జైపాల్‌రెడ్డి, భీమానాయక్, అనిల్‌రెడ్డి, వెంకటంపేట బాలయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, సహస్రవేదిక సేవా సమితి కన్వీనర్ కల్లెట్ల అరుణ్‌సాగర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మర్రిగూడ మండలంలోని కుదభాక్షపల్లి గ్రామం శివన్నగూడ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితులు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

రాజగోపాల్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని టీడీపీ మండల మర్రిగూడ నాయకులు బుధవారం మునుగోడులో కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ కార్యదర్శి మక్కెన అప్పారావు, మండల అధ్యక్షురాలు మొగుదాద పార్వతమ్మ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి మంగి మహేష్, ఉపాధ్యక్షుడు మేకల యాదగిరి, తెలుగు యువత మండల అధ్యక్షుడు దానబోయిన నరేష్ ఉన్నారు.

బెల్టు దుకాణాలు మూసివేయిస్తే అభివృద్ధి

మునుగోడు: నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అయినా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ముందుగా ఆ గ్రామంలో బెల్టు దుకాణాలను మూసివేయించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఊకొండి గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అక్కడి నుంచి మునుగోడుకు చేరుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కర్నాటి స్వామి, వైస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, నారబోయిన రవి, బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు జాల వెంకన్న యాదవ్, తాటికొండ సంతోషసైదులు, జనిగల మహేశ్వరిసైదులు, యాదగిరి, జక్కలి శ్రీను, పగిళ్ల భిక్షం, ఎంపీటీసీలు పోలగోని విజయలక్ష్మిసైదులు, ఈద శరత్‌బాబు, నిర్మల పాల్గొన్నారు.

రాజుపేటలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం రాజుపేట గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించారు. గ్రామంలో తాగు నీటి సమస్య ఉందని ఇటీవల గ్రామస్తులు మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మంత్రి ఆదేశించడంతో బుధవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. నీరు సరిగ్గా రావడం లేదని, ఒకే ఇంటిలో రెండు కుటుంబాలు ఉండడం వల్ల వచ్చే నీరు సరిపోవడం లేదని, కొత్త కనెక్షన్ ఇవ్వాలని అధికారులను గ్రామస్తులు కోరారు. డీఈ రామకృష్ణ మాట్లాడుతూ వాటర్ ట్యాంకు నుంచి ఇళ్లకు వెళ్లే పైప్ లైన్ లీకేజీల వల్ల నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. త్వరలో పైప్‌లైన్ మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ జి.శ్రీను, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వాడాల వెంకన్న, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు పల్లపు వెంకన్న, జల్లెల సైదులు, పల్లపు అంజి, పల్లపు మధు, నీలకంఠం రమేష్, పల్లపు శ్రీను పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు వైద్యశిబిరం

మర్రిగూడ: మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీఎంఆర్ ఎన్ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రాజాపేటతండాలో కిడ్నీ రోగులను గుర్తించడం కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్ బృందం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురి రక్త నమూనాలను సేకరించారు. వారు తీసుకునే ఆహారం, తాగునీటి శాంపిల్స్‌తోపాటు కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుస్సేన్, ప్రీతి, హిమబిందు, లోకేష్, వైద్యులు దీపక్, విజయ్‌ప్రసాద్, విజయమ్మ, బాసిద్, ఏఎన్‌ఎం సరిత, కలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చిట్యాల: మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి తన సోదరులతో కలిసి ఇందిరానగర్(ఏడో వార్డు)లో తన తండ్రి గోపాల్ జ్ఞాపకార్థం సొంత నిధులతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం చిట్యాల మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూరెళ్ళ రవి, కూరెళ్ళ శ్రీను, నరేష్, కౌన్సిలర్ జిట్ట పద్మ బొందయ్య, పాటి మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, వనమా వెంకటేశ్వర్లు, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోనేటి ఎల్లయ్య, పాల కృష్ణ, పోలెపల్లి సత్యనారాయణ, గుత్తా సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.





కలెక్టరేట్‌లో జరిగిన బాలికా దినోత్సవంలో కరాటే ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

నకిరేకల్: ఈ నెల 28న శాలిగౌరారంలో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆ సంఘ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు టి.నర్సింహమూర్తి, కే.శ్రీనివాస్, సంఘ నాయకులు రవీందర్, వేణుగోపాల్, భద్రయ్య, ఎల్.నగేష్, బాలాజీ, వెంకన్న, సుజాత పాల్గొన్నారు.

మర్రిగూడ: ఈ నెల 28న శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని మర్రిగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీరుడు అంజయ్య, కేజీబీవీ ప్రత్యేక అధికారి జ్యోతి కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం వారు మర్రిగూడలో ఆవిష్కరించి మాట్లాడారు. యూనియన్ మండల అధ్యక్షురాలు పి.పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధి కె.ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

మునుగోడు: గ్రామ సమస్యలపై చర్చించేందుకు బుధవారం మునుగోడులో నిర్వహించిన గ్రామ సభ వాడీవేడిగా కొనసాగింది. పలువురు వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యుడు మాట్లాడుతూ మునుగోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, అనేక మంది గ్రామ పంచాయతీ ధృవీకరణలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆరోపించారు. వార్డు సభ్యులు చేసిన అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వడం లేదని అన్నారు. సభ కొనసాగినంత సేపు పాలకవర్గ సభ్యుల మధ్య వాదోపవాదాలు కొనసాగాయి. సర్పంచ్ మిర్యాల వెంకన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

చిట్యాల: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని హైదరాబాద్‌లో చిట్యాల మండల యువజన కాంగ్రెస్ నాయకుడు గంగారపు గణేశ్ బుధవారం కలిసి శాలువా కప్పి సత్కరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన మండల స్థాయి యువజన కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు.